సాక్షి
నారాయణపేట
శనివారం ; 4 ; ఫిబ్రవరి ; 2023





**కొను'గోల్‌మాల్'పై విచారణ**

గండేడ్‌లో జరిగిన ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలపై అధికారులు విచారణ చేపట్టారు.

వివరాలు 10లో ▸



**పరిశ్రమ మూసేయాలి**

కాలుష్యం వెదజల్లుతున్న పరిశ్రమను మూసేయాలని గుండేడ్‌వాసులు నిరసన తెలిపారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
33.2 /18.1

**వాతావరణం**

ఉదయం, రాత్రి సమయాల్లో చలి ప్రభావం పెరుగుతుంది. మధ్యాహ్నం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది.

## న్యూస్‌రీల్

### అడిషనల్ కలెక్టర్ సరెండర్ ?

నారాయణపేట: జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) పద్మజారాణిని సీసీఎల్‌కు సరెండర్ చేసినట్లు తెలుస్తోంది. అడిషనల్ కలెక్టర్‌గా జాయిన్ అయినప్పటి నుంచి విధుల్లో బాధ్యతతో నిర్వహించడంలేదని, ఉన్నతాధికారులతో ఇమడడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. దీనికితోడు మూడు, నాలుగు రోజులుగా తన చాంబర్‌తో పాటు విధుల్లో ఎక్కడా కనిపించకపోవడం ఈ ఊహాగానాలకు బలాన్ని చేకూర్చుతున్నాయి. మరికొందరు మేడమ్ సెలవులో వెళ్లిందని చెప్పగా.. లేదూ పనితీరు మార్చుకోవాలని జిల్లా ఉన్నతాధికారి ఒకింత చెప్పినట్లు తెలుస్తోంది. అయినప్పటికి విధి నిర్వహణలో మార్పు రాకపోవడంతోనే సీసీఎల్ఏకు సరెండర్ చేసినట్లు సమాచారం. అడిషనల్ కలెక్టర్ సెలవులో వెళ్లిందా.. లేదా సరెండర్ చేశారా.. అనేది అధికారికంగా ప్రకటిస్తేగానీ అసలు విషయం తెలియదు.

### కంటి వెలుగును వినియోగించుకోవాలి

మద్దూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని కంటి సమస్యలు ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ సీఈఓ జ్యోతి సూచించారు. శుక్రవారం మండలంలోని చింతల్‌దిన్నెలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీడీఓ విజయలక్ష్మితో కలిసి ఆమె పరిశీలించారు. ఇప్పటి వరకు గ్రామంలో ఎంత మంది పరీక్షలు చేయించుకున్నారు, ఎంత మందికి కంటి అద్దాలు అందజేశారని సిబ్బంది అడిగి తెలుసుకున్నారు.

### మధ్యాహ్నమే.. పాఠశాలకు తాళం

కృష్ణా: మండలంలోని చేగుంట పాఠశాలలో నలుగురు ఉపాధ్యాయులు ఉన్నా కూడా శుక్రవారం మధ్యాహ్నమే పాఠశాలకు తాళం వేయగా.. విద్యార్థులు ఇళ్లకు చేరుకున్నారు. పాఠశాలలోని ఇద్దరు ఉపాధ్యాయులు సొంత పనుల నిమిత్తం సెలవుపై వెళ్లగా.. మిగితా ఇద్దరిలో ఒకరు డీఈఓ ఆఫీస్‌లో పని ఉందని ఉదయం, మరో ఉపాధ్యాయురాలు తమ కుమారుడికి జ్వరం వచ్చిందని మధ్యాహ్నమే పాఠశాలకు తాళం వేసి వెళ్లిపోయింది. దీంతో విద్యార్థులు ఇంటికి వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు ఎందుకు వచ్చారంటూ ప్రశ్నించగా.. తమకు తెలియదని, పంపించేశారని తెలిపారు. ఈ విషయంపై గ్రామ సర్పంచ్ శివప్పను వివరణ కోరగా.. ఉపాధ్యాయురాలి కుమారుడికి జ్వరం రావడంతో ఆస్పత్రికి వెళ్లేందుకు పాఠశాలకు తాళం వేశారని, కావాలని పాఠశాల బంద్ చేయలేదని తెలిపారు.

### గజవాహన సేవ



మరికల్: ఎక్లాస్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారికి గజవాహన సేవ నిర్వహించారు. 11రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో భక్తులు అత్యధికంగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు.

**మన్యంకొండలో సూర్యప్రభ..**



మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండలో శుక్రవారం రాత్రి శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామికి సూర్యప్రభవాహన సేవ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. శోభాయమానంగా అలంకరించిన సూర్యప్రభ వాహనంపై స్వామివారిని గర్భగుడి నుంచి దేవస్థానం ముందున్న మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. సన్నాయి వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రాలు, భక్తుల హరినామస్మరణ మధ్య స్వామివారి సేవ ముందుకు కదిలింది. బంగారు ఆభరణాలు, వివిధ రకాల పూల అలంకరణ మధ్య స్వామివారు సూర్యప్రభవాహనంపై ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి సేవను చూసి భక్తిపారవశ్యంతో పులకించిపోయారు. అళహరి మధుసూదన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

# ఎదురుచూపులకు స్వస్తి



నర్వలో ఆసరా పింఛన్ల కోసం వేచి ఉన్న లబ్ధిదారులు (ఫైల్)

- వితంతువులకు 'ఆసరా'తో భరోసా
- లబ్ధిదారుల గుర్తింపులో అధికారులు
- ప్రతి నెల ఎంపీడీఓ కార్యాలయాల్లో దరఖాస్తులు
- భర్త మరణిస్తే 15రోజుల్లోనే భార్యకు పింఛన్
- జిల్లాలో ఇప్పటికే 130 దరఖాస్తుల పరిశీలన

| జిల్లాలో ఆసరా లబ్ధిదారుల వివరాలిలా.. | |
|---|---|
| వితంతువులు | 30,401 |
| వృద్ధులు | 26,296 |
| దివ్యాంగులు | 9,686 |
| బీడీ కార్మికులు | 4,409 |
| ఒంటరి మహిళలు | 3,181 |
| చేనేత కార్మికులు | 2,805 |
| గీత కార్మికులు | 976 |

గత ఆగస్టులో కొత్తగా చేరిన 57ఏళ్ల లోగా లబ్ధిదారులు : 12,136

నర్వ: వృద్ధాప్యం మీద పడడంతో చాలా మంది వృద్ధులకు ప్రభుత్వం అందించే ఆసరా పింఛనే ఎంతో కొంత ఆర్థిక భరోసానిస్తోంది. ఈక్రమంలో భర్త మరణిస్తే ఆ పింఛన్ భార్య పేరుకి మారాలంటే అన్నీ ఇన్నీ ఇబ్బందులు ఉండేవికావు. భర్తకు వచ్చే పింఛన్ భార్యకు రావాలంటే మొదట భార్య దరఖాస్తు చేయాలి. కార్యదర్శులు, ఎంపీడీఓలు పరిశీలించి, ఉన్నతాధికారులకు నివేదిస్తే ఆరు నెలలకు, ఏడాదికో ఆమెకు ఆసరా మంజూరు చేసేవారు. దీంతో వితంతువులు అసలే భర్తను పోగుట్టుకొని పుట్టెడు దుఖంలో ఉన్న వారికి కుటుంభ పోషణకు తీవ్ర ఆర్థిక కష్టాలను ఎదుర్కొనేవారు. ఈ ఇక్కట్లకు చెక్ పెడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఓ నిర్ణయం తీసుకుంది. పింఛన్ వచ్చే భర్త మరణిస్తే నెలలోగా భార్యకు వితంతు పింఛన్ మంజూరు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఇప్పటికే వీరిని కార్యదర్శులు గుర్తిస్తుండగా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే పనిలో ఎంపీడీఓలు నిమగ్నమయ్యారు. ఇకపై మరణించిన 15 రోజుల్లో వివరాలు నమోదు చేసి పింఛన్ వచ్చేలా చేయనుండడంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**జిల్లాలో 78వేల మంది పింఛన్‌దారులు**

జిల్లాలోని 11 మండలాలు, మూడు మున్సిపాలిటీల పరిధిలో ఇప్పటికే మొత్తం 78 వేల మందికి పైగా పింఛన్‌దారులున్నారు. ఎన్నికల హామీలో భాగంగా గడిచిన ఆగస్టులో 57 ఏళ్ళ లోపు వారికి పింఛన్‌లు మంజూరు చేయడంతో అదనంగా మరో 12 వేల మంది జాబితాలో చేరారు. వితంతువులు, వృద్ధులు, ఒంటి మహిళలకు ప్రతి నెల రూ. 2016 చొప్పున, దివ్యాంగులకు రూ. 3016 చొప్పున పింఛన్ అందుతోంది. కాగా భర్త మరణించిన వారికి పింఛన్‌అందడం లేదనే విమర్శలు క్షేత్ర స్థాయిలో ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో అవగాహన లేకపోవడంతో మరణించిన వారి పేరుపై పింఛన్ ఖాతాలో జమవుతోంది. ఇది పక్కదారి పడుతుందనే ఆరోణలున్నాయి. మరి కొందరు పింఛన్‌కు బాధిత మహిళలు కనీసం దరఖాస్తు చేయడం లేదు. ఇలాంటి నేపథ్యంలో మరణించిన భర్త పింఛన్ భార్యకు బదలాయించడం ద్వారా వారి కుటుంబాలకు మేలు జరగనుంది. ఇప్పటికే అర్హులైన వారు జిల్లాలో సుమారు 300 మందికి పైగా ఉండొచ్చని అంచనా. వీరి జాబితాను ఎంపీడీఓలు జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులకు నివేదిస్తే అతి త్వరలో పింఛన్ వారి ఖాతాల్లో జమ కానుంది.

**సర్కారు ఆదేశాల మేరకు..**



భర్త మరణించిన వారికి వితంతు పింఛన్‌లు మంజూరు చే యాలని సర్కారు ఆదేశాలున్నాయి. గత రెండు నెలల నుండి ఈ ప్రక్రియను ప్రారంభించాలని ఈ మేరకు ఎంపీడీఓలకు సూచించడం జరిగింది. వారు గ్రామాల్లో లబ్ధిదారులను గుర్తించి ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేస్తున్నారు. అన్ని మండలాల నుంచి అర్హుల వివరాలు వస్తే ఉన్నాతాధికారులకు నివేదిస్తాం. ఇప్పటికే జిల్లాలో 130 దరఖాస్తులను పరిశీలించి మంజూరుకు ఉ న్నాతాధికారులకు నివేదించాం. వీలైనంత త్వరగా వారికి పింఛన్‌లు మంజూరవుతాయి. ఇకపై ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగనుంది.

– గోపాల్‌నాయక్, డీఆర్డీఓ, నారాయణపేట

**ప్రతి నెల ఎంపీడీఓ కార్యాలయంలోనే..**

మూడేళ్ళుగా ప్రభుత్వం ఆసరా దరఖాస్తులను పక్కన పెట్టగా చాలా మంది వితంతువులు ఇబ్బందులు పడుతున్నారు. ఇకపై భర్త మృతి చెందిన వెంటనే మరణ ధృవీకరణ పత్రం జారీ చేయడంతో పాటుగా భార్య వివరాలతో ఎంపీడీఓ కార్యాలయంలో ఆసరా దరఖాస్తులను అందించనున్నారు. ఆయా గ్రామాల కార్యదర్శులు బాధితులను నెలవారిగా గుర్తించి లబ్ధి చేకూరేలా సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయనున్నారు.

# ఊసేలేని రైల్వే కొత్త లైన్లు




- కృష్ణా–వికారాబాద్, గద్వాల–మాచర్ల రైల్వే లైన్లకు మొండిచెయ్యి
- మునీరాబాద్ లైన్‌కు రూ.345 కోట్లు..
- డోన్ వరకు డబ్లింగ్‌కు రూ.60 కోట్ల కేటాయింపు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లా ప్రజల ఆశలకు నిరాశే ఎదురైంది. ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన సాధారణ బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాలోని రైల్వే ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులు, నూతన రైల్వే లైన్లకు నిధుల మంజూరుపై అన్యాయం జరిగిందనే వాదనలు వినిపిస్తున్నాయి. నాలుగున్నర దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న కృష్ణా–వికారాబాద్, గద్వాల–మాచర్ల రైల్వే లైన్లకు మరోసారి మొండిచెయ్యి చూపారు. బడ్జెట్‌లో వీటి ఊసే ఎత్తలేదు. గతంలో కృష్ణా–వికారాబాద్ రైల్వే లైన్ కోసం ఐదుసార్లు, గద్వాల–మాచర్ల లైన్ కోసం మూడుసార్లు సర్వే చేసి వదిలేశారు. కేవలం మహబూబ్‌నగర్–మునీరాబాద్ రైల్వే, కొత్తగా మహబూబ్‌నగర్ నుంచి డోన్ వరకు డబ్లింగ్ లైన్‌కు మాత్రమే నిధులు కేటాయించారు. మహబూబ్‌నగర్–మునీరాబాద్ రైల్వేలైన్ 244 కిలోమీటర్ల నిర్మాణానికి 1997–98లో ఆమోద ముద్ర లభించింది. రూ.1723 కోట్ల అంచనా వ్యయంతో ఈ రైల్వే లైన్ చేపట్టినా.. ప్రస్తుతం ఈ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గతేడాది బడ్జెట్‌లో రూ.289 కోట్లు కేటాయించగా ప్రస్తుత బడ్జెట్‌లో రూ.345 కోట్లు కేటాయించారు. మహబూబ్‌నగర్ నుంచి మక్తల్ వరకు పలు (రైల్వే అండర్ బ్రిడ్జి)ను నిర్మాణం చేశారు. దేవరకద్ర–కృష్ణా వరకు దాదాపు 60 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయి. ఈ బడ్జెట్‌లో గతంలో కంటే ఈ లైన్‌కు ఎక్కువగా నిధులు కేటాయించడంతో పనులు మరింత చురుగ్గా జరిగే అవకాశం ఉంది.

**చాలా సంతోషంగా ఉంది**



రైల్వే బడ్జెట్‌లో మునీరాబాద్ రైల్వేలైన్‌కు అధికంగా నిధులు, కొత్తగా మహబూబ్‌నగర్ నుంచి డోన్ వరకు డబ్లింగ్ లైన్ నిధులు కేటాయించినందుకు సంతోషంగా ఉంది. ఈ నిధులతో మునీరాబాద్ రైల్వే లైన్ పూర్తయ్యే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లా మీదుగా వందే భారత్ రైళ్లను నడపాలి. మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్‌ను మరింతగా అభివృద్ధి చేయాలి.

– గోపాల్ నారాయణ, డీఆర్‌యూసీసీ మెంబర్

❒ ఉమ్మడి జిల్లా పరిధిలో ఎంతో ప్రాధాన్యత ఉన్న సికింద్రాబాద్–మహబూబ్‌నగర్ రైల్వే డబ్లింగ్ లైన్ పనులు పూర్తయ్యాయి. 2015–16లో 85 కిలోమీటర్ల నిడివి గల ఈ ప్రాజెక్టు రూ.774 కోట్ల అంచనా వ్యయంతో మంజూరైంది. కొన్నేళ్లు వరుసగా బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరగడంతో పనులు త్వరగా పూర్తి చేశారు. ఈ డబ్లింగ్ లైన్‌ను పొడిగించాలనే ఉద్దేశంతో మహబూబ్‌నగర్ నుంచి డోన్ వరకు ఈ బడ్జెట్‌లో రూ.60 కోట్లు కేటాయించారు.

| మహబూబ్‌నగర్–మునీరాబాద్ రైల్వే లైన్‌కు నిధుల కేటాయింపు (రూ.కోట్లలో) | |
|---|---|
| 2017-18 | 300 |
| 2018-19 | 275 |
| 2019-20 | 275 |
| 2020-21 | 240 |
| 2021-22 | 149 |
| 2022-23 | 289 |
| 2023-24 | 345 |

### బాలికల వసతిగృహం తనిఖీ



వసతి గృహంలో విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఎస్‌డీఓ కన్యాకుమారి

సాక్షి ఎఫెక్ట్..

మాగనూర్: మండల కేంద్రంలోని బాలికల వసతి గృహాన్ని డీఎస్‌డీఓ కన్యాకుమారి శుక్రవారం తనిఖీ చేశారు. వసతిగృహంలో కనీస వసతులు లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతుండగా దీనిపై గత నెల 30వ తేదీన 'సంక్షోభంలో సంక్షేమం' అనే శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురించాం. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి డీఎస్‌డీఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం వసతి గృహంలో నెలకొన్న సమస్యలను పరిశీలించామని, ప్రైవేట్ భవనంలో హాస్టల్ కొనసాగుతుండటంతో కొంత మేర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. సొంత భవన నిర్మాణం కోసం గ్రామంలో అవసరమైన స్థలాలను రెవెన్యూ అధికారుల సహాయంతో గుర్తించి నిర్మాణం ప్రారంభిస్తామన్నారు. వీలైనంత మేర అన్ని సౌకర్యాలు ఉన్న మరో భవనం లభిస్తే.. అందులోకి మారుస్తామని వెల్లడించారు. అనంతర బాలుర వసతిగృహాన్ని తనిఖీ చేసి విద్యార్థులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో బాలికల వసతి గృహం వార్డెన్ అనిత పాల్గొన్నారు.

### హెల్ప్ డెస్క్‌తో టీచర్లకు మేలు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలో టీచర్ల పదోన్నతుల ప్రక్రియకు సంబంధించి సందేహాలను నివృత్తి చేయడానికి తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. శుక్రవారం స్థానిక జ్యోతిరావు పూలే పాఠశాలకు చేరుకున్న టీచర్లకు అవసరమైన పత్రాలను అందించడం, వాటిని పూర్తి చేయడం, సర్వీసుకు సంబంధించిన సందేహాలు నివృత్తి చేశారు. లిస్టులో పొరపాట్లు ఉంటే వాటి కోసం ఆయా టీచర్లతో వినతిపత్రాలను అందింపచేశారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షులు శేర్‌కృష్ణారెడ్డి, సెక్రెటరీ నర్సింహా, కోషాధికారి కిశోర్, నాయకులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైన టీచర్లు

# ఉత్కంఠ!

- కొనసాగిన ఉపాధ్యాయ ధ్రువపత్రాల పరిశీలన
- తొలిరోజు 70శాతం మంది టీచర్ల హాజరు
- ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలపై 221అభ్యంతరాలు

| జిల్లాలో ధ్రువపత్రాల పరిశీలన ఇలా.. | | |
|---|---|---|
| సబ్జెక్టు | అర్హత కలిగిన వారు | వెరిఫికేషన్ చేసుకున్నది |
| ఎస్ఏ మ్యాథ్స్ | 64 | 60 |
| ఎస్ఏ ఫిజిక్స్ | 59 | 41 |
| ఎస్ఏ బయోసైన్స్ | 101 | 90 |
| ఎస్ఏ సోషల్ | 100 | 86 |
| ఎస్ఏ ఇంగ్లీష్ | 135 | 47 |
| ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం | 265 | 174 |
| ఉర్దూ మీడియం | 62 | 54 |
| మొత్తం | 786 | 552 |

నారాయణపేట రూరల్: బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఉపాధ్యాయుల్లో ఉత్కంఠ రేపుతుంది. ఇప్పటికే సీనియార్టీ జాబితా విడుదల కాగా, పదోన్నతి అవకాశం ఉన్న టీచర్లు వారి సర్వీసు పుస్తకాలు, సర్టిఫికెట్ల పరిశీలనకు శుక్రవారం రెండవసారి హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా అన్ని విభాగాల్లో కలిపి 786 మంది టీచర్లు పదోన్నతులకు అర్హత కలిగి ఉండగా వారిలో మొదటిరోజైన శుక్రవారం 552మంది హాజరయ్యారు. శనివారం 234మంది రావాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి ఒక్కసారిగా టీచర్లు రావడంతో నిరీక్షణ తప్పలేదు. సబ్జెక్టుల వారీగా పరిశీలకులను ఏర్పాటు చేసి ఎస్ఆర్‌లతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లు పరిశీలించారు. డీఎస్సీలో హాల్ టికెట్ నమోదు చేయడంతో పాటు మార్కులు పరిశీలించారు.

**అంచనాల్లో తలమునకలు**

పదోన్నతుల కోసం ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియకు హాజరైన ఉపాధ్యాయులు వారివారి అంచనాల్లో తలమునకలయ్యారు. ఒక్కొక్కరు ఎస్‌జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం విభాగాల్లో ఏది వస్తుందని అంచనా వేసుకున్నారు. ఏయే మండలాల్లో ఖాళీలు ఉన్నాయనే వివరాలను లెక్కిస్తు, సీనియర్లు, యూనియన్ నాయకులతో కలిసి సమాచారం సేకరించారు. సీనియార్టీ జాబితాలో ముందు వరసలో ఉన్నవారు తమకు పక్కాగా పదోన్నతి వస్తుందనే వారు దగ్గరి ప్రాంతాలు, హెచ్ఆర్ఏ అధికంగా వచ్చే స్థానాలపై దృష్టి పెట్టారు. మరి కొందరు పిల్లల సంఖ్య తక్కువగా ఉండటం, సింగల్ ప్యాటర్న్ పాఠశాలలా అనే ఇషయాలపై ఆరా తీశారు. బదిలీల ప్రక్రియ పూర్తికావడంతోపాటు, పూర్తి స్థాయి ఖాళీల జాబితా విడుదలైతే పదోన్నతి ఎక్కడ వస్తుందని ఒక అంచనాకు వచ్చే అవకాశం ఉందని చాలా మంది టీచర్లు చర్చించుకున్నారు.

**అభ్యంతరాలతో తలపోటు..**

ఉపాధ్యాయుల మధ్య నెలకొన్న పోటీ.. సంఘాల మధ్య ఏర్పడ్డ అఘాతం.. వెరసి అభ్యంతరాల సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చింది. శుక్రవారం ఒక్కరోజే పదోన్నతులపై 29, బదిలీలపై దామరగిద్ద, ధన్వాడ మండలాల నుంచి 192 దరఖాస్తులు వచ్చాయి. బదిలీల ప్రక్రియకు సంబంధించి ఇంకా సమయం ఉండటంతో మరి కొన్ని మండలాల నుంచి విజ్ఞప్తులు వచ్చే అవకాశం ఉంది. ఇక పదోన్నతులకు సంబంధించి ఏడింటికి పరిష్కారం చూపారు. మరో మూడు అర్హత లేనివి కావడంతో తిరస్కరించారు. ఇక మిగిలిన 19కి సంబంధించి విచారణ జరుగుతుంది. అవసరమైన వాటికి న్యాయ సలహా తీసుకోనున్నారు.

**ఫిర్యాదుల్లో మచ్చుకు కొన్ని..**

⇨ డీఎస్సీకి సంబంధించి మార్కులు తప్పుగా నమోదు చేశారని..
⇨ సీనియార్టీ లిస్టులో తమ పేర్లు కనిపించడం లేదని..
⇨ స్పౌజ్, మ్యూచువల్, ఇంటర్ డిస్టిక్ ట్రాన్స్‌ఫర్‌లో వచ్చిన వారికి పూర్తి సర్వీసును లెక్కించడం..
⇨ ఎస్సీ, ఎస్టీలు'ఫస్ట్ జనరేషన్ సర్టిఫికేట్ వాడి సర్వీసులో ఉంటూ బీఈడీ చేశారని..
⇨ ఇతర మీడియాల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పోస్టును ప్రమోషన్‌లో చూయించడం
⇨ పీహెచ్‌లకు ప్రత్యేకంగా సీనియర్టీ జాబితా ప్రకటించాలని కోరడం..
⇨ అర్హత లేకపోయినా అక్రమంగా పాయింట్స్ వేసుకున్నారని..

# ఇసుక అక్రమ రవాణాకు కళ్లెం

- వాహన యజమానులపై కేసులు నమోదు చేయాలి
- 'మన ఇసుక'ను బుక్ చేసుకునేలా అవగాహన కల్పించాలి
- కలెక్టర్ శ్రీహర్ష



జిల్లా కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు పరిశీలించిన కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట: ఇసుక అక్రమ రవాణాకు కళ్లెం వేయాలనికలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన స్యాండ్ కమిటీ సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మన ఇసుక మన వాహనం వెబ్‌సైట్‌లో బుక్ చేసుకొనేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు గృహ నిర్మాణాలకు చాలా మంది ప్రజలు మన ఇసుక వాహనంలో బుక్ చేసుకోవడం జరిగిందన్నారు. ఇసుకను బుక్ చేసుకున్న రోజు.. మరుసటి రోజైనా చేరేవిధంగా చర్యలు తీసుకున్నామన్నారు. పోలీసుల సహకారంతో రెవెన్యూ సిబ్బంది కలిసి ఇసుకను ఇంకా కట్టుదిట్టం చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటికే వర్కుర్, నాగిరెడ్డిపల్లి, లింగాల్‌చేడ్ ఇసుక రిచ్‌ల ద్వారా ఇసుకను సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ట్రాక్టర్, టిప్పర్ల ద్వారా అక్రమంగా ఇసుక తరలించే వారిపై జరిమానాలు, కేసులు విధించాలని సూచించారు. ఇంకా కొన్ని మండలాల్లో ఇతర జిల్లాల వాళ్లు ఇసుకను అక్రమంగా తరలించడం జరుగుతుందని వాటిని అరికట్టి చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. పోలీస్ రెవెన్యూ అధికారులు కలిసి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్, ఆర్డీఓ రాంచందర్ నాయక్, డీఎస్పీ సత్యనారాయణ, మైన్స్ ఎడి విజయ్‌కుమార్, గ్రౌండ్ వాటర్, పీఆర్ ఈఈ, మాగనూర్, మక్తల్, ధన్వాడ, కొత్తపల్లి తహసీల్దార్ పాల్గొన్నారు.

**సుందరీకరణ పనులు వేగవంతం**

జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి వీరా సావర్కర్ చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ శ్రీహర్ష అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన పనులను పరిశీలించారు. సుందరీకరణ పనుల్లో భాగంగా నిర్మించతలపెట్టిన పనుల్లో జాప్యం వహించడంపై అధికారులపై అగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బంది కగకుండా పనుల్లో జాప్యం చేయరాదన్నారు. రోడ్డుకు ఇరుపవైపులా మురుగు కాల్వల నిర్మాణ పనులు, డివైడర్ పనులు , లైటింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ సునీత, విజయ్‌భాస్కర్‌రెడ్డి, డీఈ మల్లేశ్, ఏఈ మహేశ్ ఉన్నారు.

### పారదర్శకంగా బదిలీల ప్రక్రియ

నారాయణపేట రూరల్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి అందిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. పట్టణంలోని జ్యోతిరావుపూలే పాఠశాలలో జరుగుతున్న ప్రక్రియను శుక్రవారం ఆయన పరిశీలించారు. పదోన్నతులకు సంబంధించి కేటగిరి వారీగా కౌంటర్లను ఏర్పాటు చేయడాన్ని అభినందించారు. ధృవపత్రాలు పరిశీలించే వారికి శిక్షణ ఇచ్చారా.. లేదా.. అడిగి తెలుసుకోవడంతోపాటు సీనియార్టీ, ఖాళీల జాబితాలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలని, ఎలాంటి తప్పులు లేకుండా ఆన్‌లైన్ విధానం చేపట్టాలన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన గైడ్‌లైన్స్‌కు అనుగుణంగా ప్రక్రియ చేపట్టాలని, అభ్యంతరాలను స్వీకరించిన వెంటనే పరిష్కరించేందుకు కృషిచేయాలన్నారు. మెడికల్‌బోర్డు అందించిన పత్రాలను క్షుణంగా పరిశీలించాలని, అర్హులైన వారికి అన్యాయం జరగకుండా చూడాలన్నారు. తప్పుడు పత్రాలు అందించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో జేడీ వెంకటనర్సమ్మ, డీఈఓ లియాకత్ అలీ, ఏఎంఓ విద్యాసాగర్, ఎస్ఓ శ్రీనివాస్, పద్మనళిని, రాజేంద్రకుమార్, యాదయ్యశెట్టి, యూనియన్ నాయకులు నర్సింహారెడ్డి, శేర్‌కృష్ణారెడ్డి, యాద్గీర్ జనార్ధన్‌రెడ్డి, నర్సింహా పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

**కొల్లాపూర్:** వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందిన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని వరిదేలకు చెందిన బొల్లు అజయ్‌కుమార్(42) తన మిత్రుడు రవిగౌడ్‌తో కలిసి గురువారం రాత్రి మద్యం సేవించాడు. రాత్రి రవిగౌడ్ ఇంట్లోనే నిద్రించాడు. నిద్రలోనే అజయ్‌కుమార్ మరణించాడు. రవిగౌడ్‌కు మెళకువ వచ్చాక అజయ్‌కుమార్ మృతిచెందినట్లు గుర్తించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చాడు. అజయ్‌కుమార్ మృతి పట్ల అనుమానం వ్యక్తం చేస్తూ అతడి సోదరుడు శ్రీనివాసులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడు గతంలో ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేశాడు.

### బాలికపై అత్యాచారయత్నం

**అమరచింత:** బాలికపై తాగిన మైకంలో వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలోని నందిమళ్లలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ శివనాగేశ్వర నాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నందిమళ్లకు చెందిన ఎనిమిదేళ్ల బాలికకు జ్వరం రావడంతో తండ్రి బైక్‌పై గురువారం సాయంత్రం ఆస్పత్రికి తీసుకెళ్లి చూయించి స్థానిక చింతల మునిరంగ స్వామి ఆలయం వద్ద దించి పొలానికి వెళ్లి వస్తా.. ఇంటికి వెళ్లాలని సూచించాడు. అక్కడి నుంచి బాలిక ఇంటికి వెళ్తుండగా, అక్కడే తాగిన మైకంలో ఉన్న రాజు అనే వ్యక్తి ఇంటి వద్ద బాలికను వదులుతానంటూ బైక్‌పై ఎక్కించుకొని జూరాల ఎడమకాల్వ వైపు వెళ్లాడు. భయపడిన బాలిక బైక్‌పై నుంచి కిందకి దూకడంతో చేతికి గాయాలయ్యాయి. అయినప్పటికీ రాజు బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడేందుకు ప్రయత్నించాడు. బాలిక బిగ్గరగా కేకలు వేయడంతో అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి బాలికను కాపాడి తల్లిదండ్రులకు అప్పగించాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి రాజును శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### వ్యక్తి ఆత్మహత్యాయత్నం

**భూత్పూర్:** మండలంలోని కొత్త మొల్గరలో శుక్రవారం పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కొత్త మొల్గరకి చెందిన కుమ్మరి మాధవులు మధ్యాహ్నం ఇంట్లో తలుపులు వేసుకొని పురుగు మందు తాగాడు. భార్య బయట కూర్చొని ఉండగా.. అకస్మాత్తుగా ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. కొద్ది సేపటి వరకు బయటకు రాకపోవడంతో వెనుక నుంచి వెళ్లి చూడగా.. అపస్మారక స్థితిలో ఉన్నాడు. దీంతో 108 వాహనంలో జిల్లా జనరల్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

### యువకుడిపై దుండగుల దాడి

**మాగనూర్(మక్తల్):** గుర్తు తెలియని వ్యక్తుల దాడిలో అంజప్ప(30) తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన సంఘటన మక్తల్ మున్సిపల్ పరిధిలోని చందాపూర్ శివారులో జంగంకుంట వద్ద గురువారం మధ్యరాత్రి చోటుచేసుకుంది. అతని మర్మాంగాలు తీవ్రంగా గాయపడటంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. శుక్రవారం ఉదయం అటుగా వెళ్లిన బాటసారులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వెంటనే చికిత్స నిమిత్తం మక్తల్ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి త రలించారు. మాగనూర్ మండలం వడ్వాట్‌కి చె ందిన అంజప్ప భార్యాభర్తలు. చందాపూర్ శి వారులోని ఓ కోళ్ల ఫాంలో పని చేస్తున్నారు. గు రువారం సాయంత్రం మద్యానికి డబ్బుల విషయమై భార్యతో గొడవ పడి ఖానాపూర్‌లోని సోదరి ఇంటికి వెళ్లాడు. రాత్రి 10 గంటలకు తి రిగి ఇంటికి వస్తుండగా ఈ సంఘటన చోటుచేసుకుందని తెలిసింది. ఈ విషయమై మక్తల్ ఎస్‌ఐ పర్వతాలును వివరణ కోరగా.. ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలియజేశారు.



విజేతలుగా నిలిచిన ఎంవీఎస్ (సీనియర్స్ విభాగం), ప్రభుత్వ జూనియర్‌కళాశాల (జూనియర్స్ విభాగం) జట్లకు ట్రోఫీలు అందజేస్తున్న డీవైఎస్‌ఓ శ్రీనివాస్, జిల్లా జైలు సూపరింటెండెంట్, సాక్షి సిబ్బంది

# ఎస్‌పీఎల్ చాంపియన్లు

## ఎంవీఎస్, ప్రభుత్వ బాలుర జట్లు

- జూనియర్స్ విభాగంలో హ్యాట్రిక్ టైటిల్ గెలిచిన ప్రభుత్వ బాలుర కళాశాల
- రన్నరప్‌గా ఎస్‌వీడీసీ, కొట్టం కళాశాలలు
- ట్రోఫీలు అందజేసిన డీవైఎస్‌ఓ, జిల్లా జైలు సూపరింటెండెంట్
- విజయవంతంగా ముగిసిన 'సాక్షి' ప్రీమియర్ లీగ్

**మహబూబ్‌నగర్ క్రీడలు:** నాలుగు రోజులుగా జిల్లాకేంద్రంలోని పిల్లలమర్రి సమీపంలోని ఎండీసీఏ మైదానంలో నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) శుక్రవారం ఉత్సాహంగా ముగిసింది. ఈ మెగా టోర్నీలో చాంపియన్లుగా సీనియర్ విభాగంలో ఎంవీఎస్ డిగ్రీ కళాశాల (మహబూబ్‌నగర్), జూనియర్ విభాగంలో ప్రభుత్వ బాలుర కళాశాల(మహబూబ్‌నగర్) జట్లు నిలిచాయి. సీనియర్‌లో ఎస్‌వీడీసీ (మహబూబ్‌నగర్), జూనియర్‌లో కొట్టం జూనియర్ కళాశాల (గద్వాల) రన్నరప్ సాధించాయి. ఎస్‌పీఎల్ జూనియర్స్ విభాగంలో వరుసగా మూడోసారి విజేతగా నిలిచి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల జట్టు హ్యాట్రిక్ సాధించింది. సీనియర్స్‌లో ఎంవీఎస్ రెండోసారి చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది.

సీనియర్ విభాగం ఫైనల్ మ్యాచ్‌లో ఎంవీఎస్ (మహబూబ్‌నగర్) జట్టు 7 వికెట్ల తేడాతో ఎస్‌వీడీసీ జట్టు (మహబూబ్‌నగర్)పై విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్‌వీడీసీ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 88 పరుగులు చేసింది. జట్టులో నవీన్ 25 పరుగులు చేశాడు. డేవిడ్ 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎంవీఎస్ కళాశాల జట్టు 8.2 ఓవర్లలో 3 వికెట్లకు 90 పరుగులు చేసింది. జట్టులో శ్రీకాంత్ 30, డేవిడ్ 22 పరుగులు చేశాడు. బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించిన డేవిడ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.



జూనియర్ విభాగం ఫైనల్ మ్యాచ్‌లో ప్రభుత్వ బాలుర కళాశాల (మహబూబ్‌నగర్) జట్టు 43పరుగుల తేడాతో కొట్టం కళాశాల (గద్వాల) జట్టుపై గెలుపొందింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ప్రభుత్వ బాలుర కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 87 పరుగులు చేసింది. జట్టులో తరుణ్ 20 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన కొట్టం కళాశాల జట్టు క్రీడాకారులు పరుగులు చేయలేక వరుసగా వికెట్లను కోల్పోయారు. 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 44 పరుగులు చేశారు. సంతోష్ 2 వికెట్లు తీశాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను సంతోష్ అందుకున్నాడు.

అంతకుముందు జరిగిన సీనియర్ మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌లో ఎంవీఎస్ కళాశాల జట్టు టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసింది. 89 పరుగుల తేడాతో జేపీఎన్‌సీఈ–1 జట్టుపై విజయం సాధించింది. నిర్ణీత 10 ఓవర్లలో ఎంవీఎస్ జట్టు 2 వికెట్లు కోల్పోయి 141 పరుగులు చేసింది. కెప్టెన్ గణేష్ అద్భుతంగా ఆడి.. 36 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్స్‌లతో 73 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన జేపీఎన్‌సీఈ–1 జట్టు 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 52 పరుగులు చేసింది. రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో ఎస్‌వీడీసీ జట్టు 49 పరుగుల తేడాతో జేపీఎన్‌సీఈ–2 జట్టుపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఎస్‌వీడీసీ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 100 పరుగులు చేసింది. జట్టులో సైఫుర్ రహెమాన్ 31 బంతుల్లో 49 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన జేపీఎన్‌సీఈ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 51 పరుగులు మాత్రమే చేసింది.

### ఫైనల్లో మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌లు


డేవిడ్ (ఎంవీఎస్), సీనియర్స్ విభాగం


సంతోష్ (ప్రభుత్వ బాలుర కళాశాల), జూనియర్స్ విభాగం

### క్రీడల్లో ప్రతిభ చాటాలి

సాక్షి ప్రీమియర్ లీగ్ బహుమతుల ప్రదానోత్సవానికి జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్, జిల్లా జైలు సూపరింటెండెంట్ వెంకటేశం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీవైఎస్‌ఓ మాట్లాడుతూ నిరంతరం ప్రాక్టీస్‌తోనే క్రీడల్లో రాణించవచ్చని అన్నారు. క్రీడా టోర్నీలతో క్రీడాకారుల ప్రతిభను వెలికితీయవచ్చన్నారు. ఓడిన వారు నిరాశ చెందకుండా మళ్లీ గెలుపు కోసం పట్టుదలతో ఆడాలన్నారు. జిల్లా సూపరింటెండెంట్ వెంకటేశం మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ చాటాలన్నారు. సాక్షి ప్రీమియర్ లీగ్‌లో రీజినల్‌తో పాటు రాష్ట్రస్థాయి టోర్నీలో విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం విన్నర్, రన్నరప్ జట్లకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సాక్షి యూనిట్ బ్రాంచ్ మేనేజర్ శ్యాంసుందర్, బ్యూరో ఇన్‌చార్జ్ కిషోర్ కుమార్, ఎడిషన్ ఇన్‌చార్జ్ హరిప్రసాద్, సాక్షి టీవీ బ్యూరో విజయ్‌భాస్కర్, స్టాఫర్ వెంకటేష్, యాడ్స్ ఇన్‌చార్జ్ శివుడు, సుధాకర్ పైప్స్ ప్రతినిధి ప్రశాంత్, పీఈటీ అబ్దుల్లా, కోచ్ ఎండీ మన్నాన్, నర్సింహారెడ్డి, వెంకటేశ్వర్లు, సాక్షి సిబ్బంది పాల్గొన్నారు. టోర్నమెంట్‌కు ఎస్‌పీఎల్‌కు స్పాన్సర్‌గా సుధాకర్ పీవీసీ వ్యవహరిస్తున్నారు. పంచవటి ఆస్పత్రి యాజమాన్యం వారు క్రికెట్ మైదానంలో అంబులెన్స్ సౌకర్యం కల్పించారు.



రన్నరప్ ట్రోఫీలు అందుకుంటున్న కొట్టం కళాశాల (జూనియర్స్), ఎస్‌వీడీసీ( సీనియర్ విభాగం) జట్లు

### సారా విక్రేతకు రూ.లక్ష జరిమానా


రసీదును పోలీసులకు అందజేస్తున్న శంకర్

**అడ్డాకుల:** నాటుసారా విక్రయించేందుకు వెళ్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసి రూ.లక్ష జరిమానా విధించారు. జడ్చర్ల ఎక్సైజ్ సీఐ బాలాజీ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మూసాపేట మండలం కనకాపూర్ తండాకు చెందిన వి.శంకర్‌నాయక్ గతంలో నాటుసారా కేసులో పట్టుబడ్డాడు. అప్పట్లోనే ఎక్సైజ్ పోలీసులు శంకర్‌నాయక్‌ను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ క్రమంలో ఈనెల 1న బైక్‌పై 2లీటర్ల నాటుసారాను తరలిస్తుండగా, జడ్చర్ల ఎక్సైజ్ సీఐ బాలాజీ, మహబూబ్‌నగర్ డీటీఎఫ్ ఎస్‌ఐ నరేష్‌రెడ్డి పట్టుకున్నారు. శంకర్‌నాయక్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ బాలాజీ తెలిపారు. గతంలో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసిన నేపథ్యంలో శుక్రవారం నిందితుడు ప్రభుత్వానికి రూ.లక్ష జరిమానాను చెల్లించి రసీదును తమకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఓలు గౌస్, దేవేంద్రప్ప ఉన్నారు.

### నాలుగు వాహనాలు సీజ్


సీజ్ చేసిన బొలేరా వాహనాలు

**మల్దకల్:** గూడ్స్ వాహనంలో కూలీలను చేరవేస్తున్న నాలుగు బొలేరా వాహనాలను శుక్రవారం మల్దకల్ ఎస్‌ఐ శేఖర్ సీజ్ చేశారు. వివిధ గ్రామాలకు చెందిన బొలేరా వాహన యజమానులు ప్రతి రోజూ 20 నుంచి 30మంది కూలీలతో వివిధ గ్రామాలకు తరలిస్తున్నారు. వాహనాల తనిఖీల్లో భాగంగా ఎస్‌ఐ నాలుగు బొలేరా వాహనాలను తనిఖీ చేయగా, అందులో పెద్ద సంఖ్యలో కూలీలను తరలిస్తుండడంతో సీజ్ చేసి పోలీస్‌స్టేషనుకు తరలించారు.

## జెన్‌కో వద్ద అగ్నిప్రమాదం

**ఆత్మకూర్:** దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం వద్ద ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. దిగువ జూరాల వద్ద నిర్మాణ పనుల సమయంలో ఆల్‌స్టామ్ కంపెనీ నిర్వాహకులు ఉపయోగించిన పైపులు, ఇతర వాడిన వస్తువుల వ్యర్థాలను గోదాం వద్ద నిల్వ ఉంచారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతో గమనించిన జన్‌కో సిబ్బంది ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఆత్మకూర్ ఫైరింజన్ అందుబాటులో లేకపోవడంతో కొత్తకోట ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. కాగా గోదాంలో రూ.కోట్లాది విలువైన సామగ్రి ఉందని, పెద్ద ప్రమాదమే తప్పిందని ఉద్యోగులు పేర్కొన్నారు. అగ్ని ప్రమాదంతో ఎలాంటి నష్టం వాటిల్ల లేదని, గడ్డి ఏపుగా పెరగడంతో ప్రమాదం సంభవించిందని జన్‌కో ఎస్‌ఈ సివిల్ సురేష్ తెలియజేశారు.


మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

### వరిధాన్యం లారీ పట్టివేత

**గట్టు:** కేటీదొడ్డి మండలం చింతలకుంట నుంచి అనుమతి లేకుండా వరిధాన్యం తరలిస్తున్న లారీని గురువారం రాత్రి గట్టు పోలీసులు, గద్వాల ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. పట్టుబడిన లారీని గట్టు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గద్వాల ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ కేశవ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చింతలకుంట నుంచి కర్నూల్‌కు అనుమతి లేకుండా లారీలో 354 వరిధాన్యం బస్తాలను తరలిస్తుండగా జిల్లా సివిల్ సప్లయ్ అధికారి రేవతి ఆదేశాల మేరకు మాచర్ల సమీపంలో లారీని పట్టుకున్నట్లు తెలిపారు.

## బైక్ రిజిస్ట్రేషన్‌కు వచ్చి రోడ్డు ప్రమాదం

- ట్రాక్టర్, బైక్ ఢీకొని కుమారుడి దుర్మరణం, తండ్రికి గాయాలు

**నాగర్‌కర్నూల్ క్రైం:** ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొని యువకుడు మృతిచెందిన సంఘటన మున్సిపాల్టీ పరిధిలోని దేశిటిక్యాలలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దకొత్తపల్లి మండలం చంద్రకల్‌కి చెందిన ఆకాశ్(20) తన తండ్రి వెంకటయ్యతో కలిసి ఇటీవల కొనుగోలు చేసిన కొత్త బైక్‌ను జిల్లా కేంద్రంలోని రవాణా శాఖ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వెళ్లారు. తిరిగి ఇంటికి వెళ్తుండగా.. దేశిటిక్యాలలో పొట్టు తీసుకొస్తున్న ట్రాక్టర్, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఆకాశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. స్థానికులు తీవ్రంగా గాయపడిన వెంకటయ్య(తండ్రి)ను చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించగా.. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

### వ్యక్తి అదృశ్యం

**అడ్డాకుల:** మండల కేంద్రానికి కోట్ల నర్సింహ(49) గురువారం నుంచి కనిపించడంలేదని అతని కుమారుడు కుమారుడు కోట్ల అశోక్‌కుమార్ శుక్రవారం అడ్డాకుల ఠాణాలో ఫిర్యాదు చేశాడు. నర్సింహ భార్య వారం క్రితం హైదరాబాద్‌లో ఉండే కుమారుల వద్దకు వెళ్లింది. ఇంటి వద్దే ఉంటున్న నర్సింహ గురువారం కనిపించకపోవడంతో పాటు అతని దుస్తులు, చెప్పులు చౌట చెరువు కట్టపై కనిపించడంతో వాటిని గుర్తించిన స్థానికులు అతని కుమారుడు అశోక్‌కు ఫోన్ ద్వారా తెలిపారు. అదే రోజు రాత్రి హైదరాబాద్ నుంచి ఇంటికి వచ్చిన అశోక్ చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో ఫిర్యాదు చేశాడని అడ్డాకుల ఎస్‌ఐ విజయకుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

### యువకుడి మృతి

**కల్వకుర్తిరూరల్:** మండలంలోని తాండ్ర సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి కల్వకుర్తి ఎస్‌ఐ రమేశ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వంగూరు మండలం మాసినోనిపల్లికి చెందిన సునీల్‌కుమార్, శివలు ద్విచక్రవాహనంపై కల్వకుర్తి వైపు వస్తున్నారు. తాండ్ర సమీపంలో డీసీఎం వాహనానికి వెనక నుం– ఢీకొట్టడంతో సునీల్‌కుమార్(26) అక్కడికక్కడే మృతిచెందగా, శివకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనపై బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేశ్ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**భూత్పూర్:** మున్సిపాలిటీ సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వాహనదారులు, స్థానికుల కథనం మేరకు.. జడ్చర్ల నుంచి భూత్పూర్ వైపునకు మోటర్‌సైకిల్‌పై వస్తున్న ఇద్దరిని, వెనుక నుంచి వస్తున్న టీఎస్ 09 ఈవై 2462 నంబరు గల కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. అలాగే మోటర్‌సైకిల్‌పై వెళ్తున్న సురేష్, మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. సురేష్ అనే వ్యక్తి కొల్లాపూర్ నియోజకవర్గంలోని మాచినేనిపల్లికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. గాయపడిన వారిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

## చీడపీడలు.. నివారణ చర్యలు

- వాతావరణ మార్పులతో వ్యాపించే తెగుళ్లు
- నష్ట నివారణ చర్యలపై అలంపూర్ ఏడీఏ సక్రియానాయక్ సూచనలు, సలహాలు

**అలంపూర్:** పంటల సాగు.. వ్యవసాయ ఉత్పత్తులు ముఖ్యంగా నేల స్వభావం– వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటాయి. విత్తనం వేసే సమయం నుంచి పంట చేతికి వచ్చే వరకు వాతావరణ ప్రభావం అధికంగా ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో అకాల వర్షాలు, విపరీతమైన ఎండలు, వర్షాభావ పరిస్థితులు, వరదలు, తుపాన్లు రావడం సర్వసాధారణంగా మారిపోయింది. ఇలాంటి విపత్కర పరిణామాల పట్ల ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియానాయక్ పేర్కొంటున్నారు.


బూజు తెగుళ్లు


నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్న సమయాల్లో

వీటిని ముందుగా తెలుసుకోగలిగితే కొంత వరకైనా జాగ్రత్తలు తీసుకొని నివారణ చర్యలు చేపడితే నష్టాలను తగ్గించే అవకాశం కలుగుతుంది. వాతావరణాన్ని బట్టి పురుగులు, తెగుళ్ల వ్యాప్తిని ముందస్తుగా పసిగట్టి చర్యలు చేపట్టవచ్చు. తుపాను సమయం మబ్బులు, తేమ వాతావరణం, ఉష్ణోగ్రతలు తగ్గడం వంటి చర్యలు బూజు తెగుళ్ల ఉధృతికి దోహదపడతాయి. అలాగే వాతావరణం పొడిగా ఉంటే ఆకుముడత రసం పీల్చే పురుగుల తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

| వాతావరణ పరిస్థితులు | ఉధృతమయ్యే చీడపీడలు |
|---|---|
| పగటి ఉష్ణోగ్రత తక్కువ | లద్దె పురుగు చురుకవుతుంది |
| పగటి ఉష్ణోగ్రత ఎక్కువ | పచ్చ దీపపు పురుగుల వృద్ధి |
| ఎక్కువ కాలం పొడి వాతావరణం | చెరుకు, మిర్చి, జొన్న, పత్తిలో రసం పీల్చే పురుగుల్లో ముఖ్యంగా నల్లి |
| ఎడతెరిపి లేని వర్షాలు పడితే | వరిలో కాండం తొలిచే పురుగు ఉధృతి తగ్గుతుంది. వరి ఈగ ఉధృతి పెరుగుతుంది |
| పూత దశలో వెచ్చని వాతావరణం | వరిలో కంప నల్లి |
| రాత్రి ఉష్ణోగ్రత 20 డిగ్రీల సెల్సియస్ కన్న తక్కువ, గాలిలో తేమశాతం ఎక్కువ | వరిలో పొట్ట కుళ్లు తెగుళ్లు, అగ్గి తెగుళ్లు |
| నీటి ఎద్దడి ఎక్కువ కాలం ఉంటే | ఫ్యుజేరియం విల్టు, కూరగాయలు, పత్తి మొదలైన పైర్ల మీద |
| వర్షాలు ఎక్కువ పడి గాలిలో తేమ ఎక్కువగా ఉంటే | ఆముదంపై కాయ కుళ్లు, బూజు తెగుళ్లు |
| సుదీర్ఘమైన బెట్ట, మధ్య మధ్య జల్లులు | పత్తిలో తెల్ల దోమ |
| వర్షం పడుతున్నప్పుడు, వాతావరణంలో తేమ అధికంగా ఉన్నప్పుడు | పత్తిలో కాయకుళ్లు |

క్లుప్తంగా...


గోదావరిలో పుష్కర ఘాట్ వద్ద మొసలి

## మొసలితో కలవరం

బాల్కొండ : నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం పోచంపాడ్ వద్ద గోదావరిలో వీఐపీ పుష్కర ఘాట్ వద్ద శుక్రవారం పెద్ద మొసలి కనిపించింది. దీంతో భక్తులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. అటవీ అధికారులు స్పందించి వెంటనే గోదావరిలో మొసళ్లను పట్టుకుని దూర ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు.

## అవకాశమిస్తే పాలకుర్తి నుంచి పోటీ చేస్తా..

మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి



తొర్రూరు: వచ్చే ఎన్నికల్లో పార్టీ అవకాశమిస్తే పాలకుర్తి నుంచి పోటీ చేస్తానని మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ నేత కొండా మురళి అన్నారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని టీచర్స్ కాలనీలో నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కొండా మురళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశిస్తే పాలకుర్తి నియోజకవర్గంలో ఎర్రబెల్లిపై పోటీ చేస్తానని తెలిపారు. ఈనెల 9న పాలకుర్తి దేవస్థానంలో పూజలు నిర్వహించి.. కార్యకర్తల అభీష్టం మేరకు నియోజకవర్గంలో కార్యక్రమాలు ప్రారంభిస్తానని తెలిపారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

## క్రమబద్ధీకరణ హామీపై హర్షం

సాక్షి, హైదరాబాద్: కాంట్రాక్టు ఉద్యోగుల సేవల క్రమబద్ధీకరణ ప్రక్రియ కొనసాగుతుందని గవర్నర్ తమిళిసై అసెంబ్లీలో ప్రకటించడాన్ని కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ స్వాగతించారు. ప్రభుత్వం క్రమబద్ధీకరణ జీవో జారీ చేసినా ఇంతవరకూ అమలు కాలేదని గుర్తు చేశారు.

# బిల్లును ఓకే చేయించి.. అవిశ్వాసాలు ఆపేలా..!

- పురపాలికల్లో 'లొల్లి'కి చెక్‌పెట్టేందుకు సర్కారు ప్రయత్నాలు
- మేయర్లు, చైర్‌పర్సన్లపై అవిశ్వాస తీర్మానానికి కనీస గడువును నాలుగేళ్లకు పెంచుతూ గత అసెంబ్లీలో తీర్మానం
- సదరు బిల్లు గవర్నర్ వద్ద పెండింగ్
- ఇదే అదనుగా పురపాలికల్లో అవిశ్వాస తీర్మానాల నోటీసులు
- గవర్నర్ ద్వారా బిల్లు ఆమోదింపజేసి వాటిని ఆపాలని ప్రభుత్వ యోచన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పలు కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో నెలకొన్న అవిశ్వాసాల గందరగోళానికి తెర దించాలని ప్రభుత్వం భావిస్తోంది. జనవరి 26తో మూడేళ్ల పదవీకాలం పూర్తి చేసుకొన్న 127 పట్టణ, నగర పాలక మండళ్లలో చాలా చోట్ల లుకలుకలు బహిర్గతమయ్యాయి. పలుచోట్ల ఇప్పటికే మున్సిపల్ చైర్‌పర్సన్లు, మేయర్లపై అవిశ్వాస తీర్మానానికి నోటీసులు కూడా ఇచ్చారు. కొన్ని పట్టణాల్లో క్యాంపులు, కొనుగోళ్ల పర్వం కూడా మొదలైంది. అవిశ్వాసాలు ప్రతిపాదించిన పట్టణాలు, నగరాల్లో అధికార బీఆర్ఎస్ పాలక మండళ్లే కొలువు తీరి ఉండటం, ప్రస్తుత మేయర్లు, చైర్‌పర్సన్లను గద్దె దించేందుకు సొంత పార్టీ ప్రతినిధులే అవిశ్వాసం నోటీసులు ఇవ్వడం గమనార్హం. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే రంగంలోకి దిగింది. పట్టణ, నగర పాలక మండళ్లలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు ఉన్న కనీస గడువును నాలుగేళ్లకు పెంచుతూ గత అసెంబ్లీ సమావేశాల్లో తీసుకొచ్చిన బిల్లు ఆమోదం పొందితే మరో ఏడాది వరకు సమస్య ఉండదని భావిస్తోంది. రెండు, మూడు రోజుల్లో మున్సిపల్ చట్ట సవరణ బిల్లుకు గవర్నర్ ఆమోదం లభించేలా పావులు కదుపుతోంది.

### ఇన్నాళ్లుగా పెండింగ్‌లో..

తెలంగాణ మున్సిపల్ చట్టం– 2019 ప్రకారం నగర, పురపాలక సంఘాల్లో మేయర్/ డిప్యూటీ మేయర్, మున్సిపల్ చైర్ పర్సన్/వైస్ చైర్‌పర్సన్లపై అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించేందుకు.. పాలక మండలి ఏర్పాటైన నాటి నుంచి కనీసం మూడేళ్లు గడువు పూర్తయి ఉండాలి. ఈ నిబంధనకు సవరణ చేయాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం గత సెప్టెంబర్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో అవిశ్వాస కనీస గడువును నాలుగేళ్లకు పెంచుతూ మున్సిపల్ చట్టం సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. అసెంబ్లీ ఆమోదించినా గవర్నర్ వద్ద పెండింగ్‌లో పడింది. రాష్ట్ర ప్రభుత్వానికి, రాజ్‌భవన్‌కు మధ్య ఏర్పడిన అగాథం నేపథ్యంలో గవర్నర్ వద్ద ఆగిన ఏడు బిల్లుల్లో మున్సిపల్ చట్ట సవరణ బిల్లు కూడా ఉంది. మరోవైపు రాష్ట్రంలోని పుర/నగర పాలక సంస్థల పాలక మండళ్లకు గత నెల 26తో మూడేళ్ల పదవీకాలం పూర్తయింది. ఇదే అదనుగా అసమ్మతి ప్రజాప్రతినిధులు అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇవ్వడం మొదలుపెట్టారు. అవన్నీ కలెక్టర్ల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఈలోపే చట్ట సవరణ బిల్లు ఆమోదం పొందితే సమస్యకు చెక్‌పడుతుందని సర్కారు భావిస్తున్నట్టు సమాచారం.

### రాజ్‌భవన్‌తో సయోధ్య కుదిరిన నేపథ్యంలో..

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఉన్నతస్థాయిలో కుదిరిన సయోధ్య నేపథ్యంలో.. గవర్నర్ తమిళిసై శుక్రవారం అసెంబ్లీలో ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ క్రమంలోనే గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న చట్ట సవరణ బిల్లులకు ఆమోదం పొందేలా ప్రభుత్వ వర్గాలు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. మున్సిపల్ చట్ట సవరణ బిల్లు విషయమై ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ గవర్నర్‌ను కలవాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ బిల్లు విషయంలో గవర్నర్‌కు ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసి ఆమోదించాల్సిందిగా కోరాలని భావిస్తున్నట్టు తెలిసింది.


అసెంబ్లీని సందర్శించిన జర్మనీ ఎంపీల బృందం. చిత్రంలో పోచారం, కేటీఆర్ తదితరులు

## అసెంబ్లీకి జర్మనీ బృందం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభను శుక్రవారం జర్మనీ బృందం సందర్శించింది. జర్మనీ, ఇండియన్ పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్‌లో భాగంగా రాష్ట్రాన్ని సందర్శించిన జర్మనీ పార్లమెంట్ సభ్యుల బృందం శుక్రవారం రాష్ట్ర అసెంబ్లీలోని కమిటీ హాల్‌లో ఐటీ, పరిశ్రమలు, పురపాలక శాఖ మంత్రి కె.తారకరామారావుతో సమావేశమైంది. ఈ సందర్భంగా రాష్ట్రంలో వ్యాపార అవకాశాలు, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు తదితర అంశాలను మంత్రి జర్మనీ బృందానికి వివరించారు. సమావేశంలో శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి జి జగదీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి జర్మనీ బృంద సభ్యులను శాలువా, మెమెంటోతో సత్కరించారు.

## జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస నోటీసులు

జనగామ: జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్‌పై అధికార బీఆర్ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ సభ్యులు శుక్రవారం అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కి అవిశ్వాస నోటీసులు అందజేశారు. తొమ్మిది రోజులపాటు క్యాంపు రాజకీయం నడిపించిన అధికార పక్షం ఆ ఇద్దరిని తొలగించాలని కోరుతూ 11 మంది బీఆర్ఎస్, 8 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు వేర్వేరుగా అవిశ్వాస నోటీసులు ఇచ్చారు. ఫ్లోర్‌లీడర్ మారబోయిన పాండును తొలగించాలని అధిష్టానాన్ని కోరినట్లు బీఆర్ఎస్ కౌన్సిలర్లు తెలిపారు. కాంట్రాక్టర్లు, ఇళ్లనిర్మాణ అనుమతులకు కమీషన్లు వసూలు చేస్తూ పార్టీని అప్రతిష్టపాలు చేస్తుండటంతో అవిశ్వాసం నోటీసులు ఇచ్చినట్లు చైర్‌పర్సన్ రేసులో ఉన్న 19వ వార్డు సభ్యురాలు బండ పద్మ తెలిపారు. కాగా, నలుగురు బీజేపీ సభ్యులు కూడా తమతో టచ్‌లో ఉన్నారని ఆమె చెప్పారు.


ఏసీకి అవిశ్వాస ప్రకటన అందిస్తున్న అధికార, ప్రతిపక్ష సభ్యులు

## రాజకీయ రిజర్వేషన్లు చట్టబద్ధం చేయాలి

సాక్షి, న్యూఢిల్లీ: బీసీ ప్రధానమంత్రి మోదీ హయాంలోనే బీసీ లకు 27 శాతం రాజకీయ రిజర్వేషన్లను చట్టబద్ధం చేయాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ డిమాండ్ చేశారు. ఆయన ఢిల్లీలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ 75 ఏళ్లుగా అగ్రవర్ణాలు, కార్పొరేట్ శక్తు లు తీవ్ర వివక్షకు గురిచేయడంతో చేతివృత్తుల వారు శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. సమావేశంలో బీసీ రాజ్యాధికార సమితి ఢిల్లీ కేంద్ర కమిటీ కన్వీనర్ ప్రకాష్ వర్మ పాల్గొన్నారు.

## క్షమాపణ చెప్పకుంటే జైలుకే..

న్యాయవాది బాలముకుంద్‌పై ధిక్కార కేసులో హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: న్యాయమూర్తికి షోకాజ్ నోటీసు జారీ చేసినందుకు న్యాయవాది బాలముకుంద్‌రావుపై కోర్టు ధిక్కార కేసు నమోదైంది. బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేదంటే జైలుకు పంపిస్తామని చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం ముకుంద్‌రావును హెచ్చరించింది. టూరిజం శాఖను సంబంధించిన కేసు విచారణ సందర్భంగా జస్టిస్ పి.మాధవిదేవి కోర్టు హాల్లో జడ్జితోపాటు ఇతర న్యాయవాదులతో ఆయన పరుషంగా మాట్లాడారు. పైగా కేసుకు సంబంధించి వారం రోజుల్లో వివరణ ఇవ్వాలంటూ న్యాయమూర్తికి నోటీసులిచ్చారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం బాలముకుంద్‌రావుపై క్రిమినల్ ధిక్కార చర్యలు చేపట్టి విచారణ నిర్వహించింది. ఈ సందర్భంగా ఏజీ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. ఘటన జరిగిన తర్వాత కూడా న్యాయమూర్తికి క్షమాపణ చెప్పలేదన్నారు.

## నేడు బుర్రవీణ.. మధుర గానం

బుర్రవీణకు చిట్టచివరి చిరునామా దాసరి కొండప్ప

- ఇండో–ఫ్రెంచ్ సంగీత కచేరీలో పాల్గొననున్న నారాయణపేట కళాకారుడు
- మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కార్యక్రమం


బుర్రవీణ వాయిస్తున్న దాసరి కొండప్ప

నారాయణపేట: నారాయణపేట జిల్లా దామరగిద్దకు చెందిన బుర్రవీణ కళాకారుడు దాసరి కొండప్పకు శనివారం హైదరాబాద్‌లో జరిగే ఓ సంగీత కచేరీలో ఫ్రెంచ్ కళాకారుడు అజరక్ అలెగ్జాండ్రా జురైస్‌తో కలిసి పాల్గొనే అవకాశం వచ్చింది. ఇన్‌స్టిట్యూట్ ఫ్రాంకైస్, అలైన్స్ ఫ్రాంకైస్ ఆఫ్ హైదరాబాద్, స్టేట్ ఆర్ట్ గ్యాలరీల సంయుక్త ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో సాయంత్రం 5 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. జురైస్ 25 ఏళ్లుగా భారతీయ సంగీతాన్ని శాంతినికేతన్ కేంద్రంగా అభ్యసించారు. జురైస్ తంత్రి వాదకుడు. డప్పు, డిడ్‌గిరిడో అనే ఊదే వాద్య నిపుణుడు.

### రాగాలాపనలో దిట్ట

కొండప్ప జానపద సంగీతకారుడైనప్పటికీ అనేక రకాల రాగాలను ఆలపించడంలో దిట్ట. జానపదం, శాస్త్రీయ సంగీత రంగంలో అతనొక అద్భుత కళాకారుడు. కడుపేద స్థితిలో జీవిస్తున్నా సంగీతాన్నే నమ్ముకున్నాడు. సంగీతం అతని వృత్తి కాగా.. ప్రవృత్తి గానం. ఆకలితో అలమటిస్తున్నా.. శక్తి లేకపోయినా ఆ వాద్యమే.. ఆ రాగాలే అతని అపురూప స్నేహితులు. బుర్రవీణ వాద్యాన్ని అద్భుతంగా వాయించే చిట్టచివరి కళాకారుడు ఆయనే కావడం.. ఆ వాద్యం అతనితోనే అంతరించిపోతుండడం బాధాకరం. విల్లాడి వాద్యం, భూమి వీణ వంటివి ఇంకా గిరిజనుల్లో బతికి ఉన్న మూల సంగీత వాద్య అవశేషాలు. అలాంటి కోవకు చెందినదే బుర్రవీణ వాయిద్యం. కొండప్పకు కళాకారుల కోటా పింఛను రావడం లేదు. భిక్షాటన చేస్తూ తత్వ గీతాలు, కథలు చెబుతూ బతుకు బండిని అతికష్టంగా లాగుతున్నాడు.

## పేద దళితులకే దళితబంధు ఇవ్వాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ (టీఎస్) నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: పేద దళితులకే దళితబంధు పథకాన్ని వర్తింపజేయాలని ఎమ్మార్పీఎస్ (టీఎస్) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దళితబంధు విధివిధానాలు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకాన్ని స్వాగతిస్తున్నామని.. ఎమ్మెల్యేలకు పూర్తి అధికారం ఇవ్వటంతో అర్హులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతి నియోజకవర్గంలో మాదిగ ఓటర్లు 30 వేల నుంచి 40 వేల మంది ఉన్నారని.. అందుకు అనుగుణంగా 20 వేల మందికి దళితబంధు వర్తింపజేయాలని కోరారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణ సాధనకు అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ శంకర్‌కు డిమాండ్ల వినతిపత్రాన్ని అందజేశారు. అంతకుముందు ఎమ్మార్పీఎస్ (టీఎస్) నాయకులు కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలు విన్నవిస్తామంటే పోలీసులు వారిని కలెక్టరేట్‌లోకి అనుమతించలేదు. ఓ దశలో నాయకులు, పోలీసుల మధ్య కొంత తోపులాట జరిగింది. చివరకు పోలీసులు ఏఓ శంకర్‌ను పిలిపించి నాయకులతో వినతిపత్రం ఇప్పించడంతో ఆందోళన సద్దుమణిగింది. ధర్నాలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి జంబులయ్య, అంజన్న, జయన్న, జయమ్మ, రావుల కృష్ణ, రమేష్, నరేష్, సాయికుమార్, యాదయ్య, గోపాల్, రాజు, చెన్నయ్య, రాములు, రవి, సురేష్, ఎర్ర నర్సింహ పాల్గొన్నారు.

## పదేళ్లకు వ్యక్తి ఆచూకీ లభ్యం

అమ్రాబాద్: మండలంలోని వంకేశ్వరం గ్రామానికి చెందిన కొయ్యల వైకుంఠం మతిస్థిమితం కోల్పోయి పదేళ్ల కిందట ఊరి నుంచి వెళ్లిపోయాడు. కొన్నిరోజుల పాటు కుటుంబ సభ్యులు వెదికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈయన కోల్‌కతా సమీపంలోని బెహరంపూర్ మానసిక చికిత్సాలయంలో చికిత్స పొందుతున్నట్లు గురువారం రేడియో హామ్స్ రమేష్ పేరుతో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. అతడు వైకుంఠమేనని గ్రామస్తులు, బంధువులు గుర్తించారు.

# కొను'గోల్‌మాల్'పై విచారణ ప్రారంభం

కమీషన్ల కక్కుర్తిపై ఆరా..

సాక్షి ఎఫెక్ట్..

గండేడ్: మండలంలో జరిగిన ధాన్యం కొనుగోలు అక్రమాలపై రెండురోజుల పాటు 'సాక్షి' దినపత్రికలో 'ధాన్యం కొనుగోల్‌మాల్, కమీషన్ల కోసం కక్కుర్తి' శీర్షికన వరుస కథనాలు ప్రచురితం అయ్యాయి. దీంతో అడిషనల్ కలెక్టర్ సీతారామరావు స్పందించి విచారణకు ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలు మూతబడి సుమారు రెండునెలలు గడుస్తున్నా మండలంలోని పలువురి కేంద్రాల నిర్వాహకులు ట్రక్‌షీట్లు, ఇతర రికార్డులు జిల్లా కార్యాలయంలో అందజేయలేదు. కొనుగోళ్లలో అక్రమాలు చోటు చేసుకోవడంతోనే ఇవ్వలేదన్న ఆరోపణలు గుప్పుమన్నాయి. ఈ విషయాన్ని వెలుగులోకి తీసుకురావడంతో అడిషనల్ కలెక్టర్ క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలని కిందిస్థాయి అధికారులను ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు శుక్రవారం డీపీఎం చెన్నయ్య మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలోకి పలు గ్రామాల కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను పిలిచి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు. గ్రామాల్లో ఎంతమంది రైతుల నుంచి ధాన్యం సేకరించారు.. ఎన్ని క్వింటాళ్ల కొనుగోలు చేశారు.. ఏ రోజు తూకం వేశారు.. ఏ రైస్‌మిల్లుకు పంపించారు.. వాటికి సంబంధించిన ట్రక్ షీట్లు చూపించాలని కోరారు. మిగతా గ్రామాలకు చెందిన చాలామంది నిర్వాహకులు పత్రికలో కథనాలు వచ్చిన మరుసటి రోజు జిల్లా కార్యాలయంలో అందజేశారు. లింగాయిపల్లి, రెడ్డిపల్లి గ్రామాలకు చెందిన కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల నుంచి కూడా వివరాలు సేకరించారు. సుమారు నాలుగు గంటల పాటు ఆ రెండు కేంద్రాల వివరాలు పరిశీలించారు. ట్రక్ షీట్లు, రోజువారీ వివరాల నమోదుతో పాటు మిగతా విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఇతర గ్రామాల నుంచి ఎందుకు కొనుగోలు చేశారు.. ఎవరెవరి పేర్ల మీద ధాన్యం వేశారు.. కేంద్రాలకు కాకుండా నేరుగా రైస్‌మిల్లులకు ఎందుకు పంపించారన్న విషయాలపై ఆరా తీశారు. పలువురు వీబీకేలు, సీసీలను కూడా విచారించారు. పూర్తి నివేదికను అడిషనల్ కలెక్టర్‌కు అందజేయనున్నట్లు డీపీఎం చెన్నయ్య తెలిపారు. విచారణలో ఏపీఎం బాలకృష్ణ ఉన్నారు.


విచారణ చేపడుతున్న డీపీఎం చెన్నయ్య




## జీబీపీఎల్ సీజన్–5 బ్రోచర్ల ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ క్రీడలు: గోర్ బంజార ప్రీమియర్ లీగ్ సీజన్–5 క్రికెట్ టోర్నమెంట్ బ్రోచర్లను హైదరాబాద్‌లో రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టోర్నీ ఆర్గనైజర్లు మాట్లాడుతూ సద్గురు సేవాలాల్ మహారాజ్ 284వ జయంతిని పురస్కరించుకొని జీబీపీఎల్ సీజన్–5 నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జీబీపీఎల్ క్రికెట్ టోర్నీ ఈ నెల 13న జిల్లాకేంద్రంలోని ఎండీసీఏ మైదానంలో ప్రారంభమవుతుందని తెలిపారు. జీబీపీఎల్ ఆదివాసి, గిరిజన తెగకు చెందిన వారే పాల్గొనాలని కోరారు. విజేతగా నిలిచిన జట్టుకు రూ.1,00,155, రన్నరప్ జట్టుకు రూ.50,155 నగదు బహుమతులు, ట్రోఫీలు అందజేస్తామని తెలిపారు. ఆసక్తి గల జట్లు శనివారం ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటలకు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని కోరారు. మిగతా వివరాల కోసం చరణ్‌నాయక్ (9010322645), ఛత్రపతి (6301399507), చందర్ రాథోడ్ (9848830250), కిషన్ పవార్ (9032860912) నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో జీబీపీఎల్ ఆర్గనైజర్లు ఆర్.రవిరాథోడ్, రంగనాయక్, వెంకట్‌నాయక్, కొర్ర వినేష్, జగదీష్‌నాయక్ పాల్గొన్నారు.

## పరిశ్రమ మూసేయాలని నిరసన


పోలీస్‌స్టేషన్‌లో మహవీర్ పరిశ్రమపై ఫిర్యాదు చేస్తున్న గుండేడ్ గ్రామస్తులు

గుండేడ్ వాసుల నిరసన

బాలానగర్: కాలుష్యపు పరిశ్రమతో గుండేడ్‌లోని ప్రతిఒక్కరూ రోగాల బారిన పడుతున్నారని, ఇలాంటి పరిశ్రమను మూసివేయాలని గుండేడ్ గ్రామస్తులు నిరసన తెలిపారు. శుక్రవారం మహవీర్ పరిశ్రమ వద్ద టెంట్ ఏర్పాటు చేసుకుని వందల సంఖ్యలో గ్రామస్తులు ప్లకార్డులు పట్టుకుని ధర్నా చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామం నుంచి బాలానగర్ మండల కేంద్రానికి వచ్చి తహసీల్దార్ శ్రీనివాస్‌తో పాటు పోలీస్ స్టేషన్‌లో పొల్యూషన్ పరిశ్రమతో గ్రామస్తులందరి ఆరోగ్యం నాశనం అవుతుందని, మూసి ఉన్న పరిశ్రమను తెరిచి గుండేడ్ గ్రామస్తుల ఉసురు పోసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గ్రామంలో, పరిశ్రమ వద్ద విచారణ జరిపి పరిశ్రమను మూసివేయాలని డిమాండ్ చేశారు. లేదంటే కాలుష్యపు పరిశ్రమే కావాలంటే గ్రామస్తులందరం, గ్రామాన్ని ఖాళీ చేసి వెళ్లేందుకు తమ భూములు, ఇళ్లు ప్రభుత్వం కొనుగోలు చేసి, ఇతర ప్రాంతంలో పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమ వెదజల్లే కాలుష్యంతో గ్రామంలో ఎక్కడ చూసినా నల్లటి దూళి దర్శనం ఇస్తుందని పేర్కొన్నారు. పరిశ్రమను పరిశీలించి కలెక్టర్‌కు గ్రామస్తుల వినతి పంపుతానని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

## భక్తిశ్రద్ధలతో బీరప్ప జాతర


మక్తల్‌లో బండారు చల్లుకుంటున్న భక్తులు

కోలాహలంగా ఎల్లమ్మ బండారు ఉత్సవాలు

మక్తల్: కుర్వ కులస్తుల ఆరాధ్య దైవమైన బీరప్ప దేవర ఉత్సవాలు మక్తల్‌తోపాటు మండలంలో భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. శుక్రవారం మహిళలు మొక్కులు తీర్చుకునేందుకు వేపాకుతో పుట్టం కట్టుకొని గ్రామంలో బీరప్ప దేవాలయం నుంచి ఊరేగింపుతో బయలు దేరి ఎల్లమ్మ ఆలయానికి చేరుకొని మొక్కులు తీర్చుకొన్నారు. పలు వంటకాలను నైవేద్యంగా పెట్టి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పసుపు శరీరంపై చల్లుకుంటే ఇంట్లో అన్ని శుభాలే జరుగుతాయని వీరి నమ్మకం. దీంతో ఐదేళ్లకు ఒకసారి జరిగే ఉత్సవాలకు కర్ణాటక, మహారాష్ట్ర, హైదరాబాద్, తదితర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఉత్సవాలకు భక్తులు తరలిరాగా.. పసుపు బండారును చల్లుకునేందుకు పోటీపడ్డారు. ఎల్లమ్మ ఆలయంలో ఉన్న బండారును పోటీపడి కుటుంబ సమేతంగా చల్లుకొన్నారు. ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు.

## లక్ష్మీవేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



జడ్చర్ల టౌన్: పట్టణంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున స్వామికి వేదపండితులు సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం పంచామృతాభిషేకం జరిపించి అలంకరణ చేశారు. సాయంత్రం గణపతిపూజ, పుణ్యాహవచనం, కంకణపూజ, గోపూజ, ప్రదోషపూజలు జరిపారు. మేళతాళాలతో పుట్టమన్ను తీసుకువచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.

- ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిపించనున్నారు. పేదల కల్యాణ వేదికగా పేరుగాంచిన జడ్చర్ల వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి కల్యాణోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకానున్నారు. ఇందుకోసం ఆలయంలో ఏర్పాట్లు పూర్తిచేశారు.

## సమస్యలపై అలుపెరగని పోరాటం

మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు

పెంట్లవెల్లి: నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటం చేస్తున్నానని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం పెంట్లవెల్లి మండలం గోపులాపురంలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామంలో సీసీరోడ్లు, రైతులకు సాగునీరు అందించిన ఘనత తనదేనని.. విద్యుత్ సరఫరా కోసం పోరాడి జైలుకు వెళ్లిన విషయాన్ని ప్రస్తుతం అధికారంలో ఉన్న నాయకులు మరచిపోతున్నారని తెలిపారు. ప్రజల సమస్యల సాధనకు పోరాడే సత్తా లేనప్పుడే అధికారానికి లొంగుతారన్నారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మంత్రి పదవిని సైతం వదులుకొని పోరాటానని తెలిపారు. తన హయాంలో పలు అభివృద్ధి పనులకు చేసిన శంకుస్థాపన చేస్తే నేటికీ వాటిని పూర్తి చేయలేకపోతున్నారని మండిపడ్డారు. అధికార బలంతో చిన్న కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తూ బెదిరింపులకు పాల్పడటం సరికాదన్నారు. ఇకపై ఎవరూ భయపడొద్దని నిత్యం అండగా ఉంటానని, ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి పోరాడుతానని తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపీపీ గోవింద్‌గౌడ్, వైస్ ఎంపీపీ భీంరెడ్డి, యంగంపల్లి సర్పంచ్ గోపీనాయక్, హరిప్రసాద్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.